

కనువిందు చేస్తున్న రాయికల్ జలపాతం

జల సవ్వళ్లు..

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు
- చెరువులు, కుంటలకు జలకళ.. పొంగిపొర్లుతున్న వాగులు
- పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు
- రాయికల్‌లో జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మొన్నటి వరకు ఎండిపోయి కనిపించిన చెరువులు, కుంటలు, వాగులు మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జలకళను సంతరించుకున్నాయి. తొగుట మండలంలోని ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో రైతులు పొలం పనులు మొదలుపెట్టారు. సోమవారం ఉదయం చందాపూర్ గ్రామశివారులో కూడవెల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పొంగిపొర్లింది. తొగుట మండలంలో 62.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గం సైదాపూర్ మండలం రాయికల్ శివారు మోహినికుంట నిండి గుట్టల మధ్య నుంచి జలపాతం జాలువారుతున్నది. వరుసగా వర్షాలకు జలపాతం జోరుగా జాలువారుతుండడంతో పర్యాటకులు పోటెత్తుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కోటగిరి గుట్టనుంచి వచ్చే నీటితో జెండా గుట్ట మీదుగా సుమారు 40 మీటర్ల ఎత్తు నుంచి నీటి ప్రవాహం వస్తుంది. వర్షాకాలంలో మూడు నెలలపాటు జలపాతం జాలువారుతుంది. సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పర్యటకులు ఇక్కడికి వస్తుంటారు. ఆ జలపాతం కింద తడుస్తూ ఆనందంగా గడుపుతారు. అయితే, ఈ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

– అక్కన్నపేట/తొగుట, జూలై 22



పొంగిపొర్లుతున్న తొగుట మండలం చందాపూర్ శివారులోని కూడవెల్లి చెక్‌డ్యాం



రాయికల్ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

అధ్యక్షా..


గళమెత్తే సమయం ఆసన్నమైంది
నేటి నుండి అసెంబ్లీ సమావేశాలు

- ఉమ్మడి జిల్లాలో సమస్యలెన్నో
- సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు మోక్షముందా
- 'కాళేశ్వరం' కాలువల నిర్మాణానికి ఆటంకాలు
- తీరని మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు
- అభివృద్ధి, పరిశ్రమలకు నిధులు అవసరం
- మంత్రులు దామోదర్, పొన్నంపైనే ఆశలు
- హామీల పరిష్కారానికి ఎమ్మెల్యేలపై ఒత్తిడి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 22 : నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. వివిధ రంగాలకు నిధుల కేటాయింపులపైనే అందరి దృష్టి నెలకొన్నది. తొమ్మిది నెలల కాలంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరగడంతో ఆ ప్రభావం అభివృద్ధి పనులపై పడింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలపైనా ఒత్తిడి పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోనూ అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. వీటన్నింటికీ నిధుల కేటాయింపే ముందున్న పరిష్కారం. గత ప్రభుత్వంలో సీఎం, ఆర్థిక మంత్రి ఇద్దరూ ఉమ్మడి జిల్లా వాసులే కావడంతో నిధుల పరంగా ప్రాధాన్యత ఉండేది. ఆ లోటును అధిగమించేలా మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతోపాటు ఎమ్మెల్యేలూ గట్టిగా పట్టుబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్థిక బాసటతోనే అభివృద్ధి

సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల అభివృద్ధి పనులు ఆర్థిక వనరులపైనే ఆధారపడి ఉన్నాయి. రైతాంగాన్ని ఆదుకునే సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులకు మోక్షం కలిగించాలి. గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల అనుసంధాన కాలువలు పూర్తిచేయాలంటే భారీగా కేటాయింపులు జరగాలి. గజ్వేల్, అందోలు, దుబ్బాక, హుస్నాబాద్, సిద్దిపేట, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి. ఓ వైపున జాతీయ రహదారుల నిర్మాణం చకచకా సాగుతుంటే పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు చీటికిమాటికీ మరమ్మతులకు గురవుతున్నాయి. రహదారుల నిర్మాణానికి సరిపడా నిధులు విడుదల చేయాలి. గురుకులాలతోపాటు ప్రభుత్వ విద్యాసంస్థలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో చాలా విద్యాసంస్థలు అద్దెభవనాల్లోనే అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.





వీటిపై దృష్టిసారిస్తారా?

హుస్నాబాద్



- గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లకు నిధులు అవసరం, కాలువల పనులు పూర్తికావాల్సి ఉంది.
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుపై హామీ
- నియోజకవర్గంలోని గిరిజన తండాలకు రహదారులు నిర్మించాలి.
- అక్కన్నపేట మండలంలోని పది గ్రామాలను హుస్నాబాద్ మండలంలో చేర్చాలి.
- సుందరగిరి వెంకటేశ్వరస్వామి, కొత్తకొండ వీరభద్రస్వామి, హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయాల అభివృద్ధి
- శనిగరం ప్రాజెక్టు, రాయికల్ జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.

సిద్దిపేట



- ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధంగా నిర్మించిన వెయ్యి పడకల ఆస్పత్రిలో అన్ని వసతులనూ కల్పించాలి
- నిలిచిన ప్రభుత్వ వెటర్నరీ కళాశాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలి
- రంగనాయకసాగర్ రిజర్వాయర్‌కు అనుసంధానంగా మైనర్, సబ్‌మైనర్ కాలువలను నిర్మించాలి
- పర్యాటకధామంగా నిలుస్తున్న కోమటిచెరువు వద్ద నెక్లెస్‌రోడ్డు విస్తరణ, శిల్పారామం పనులకు నిధుల కొరతను తీర్చాలి.
- అసంపూర్తిగా ఉన్న రంగనాయకసాగర్ టూరిజం పనులకు కేటాయించిన నిధులతో పనులు చేపట్టాలి.

గజ్వేల్



- ఉపాధి కల్పన కోసం మంజూరైన పరిశ్రమలను పరిరక్షించి స్థానికంగా ఏర్పాటు చేయడం
- అసంపూర్తిగా ఉన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితుల పరిహారం, ఇతర సమస్యల పరిష్కారానికి నిధులు
- కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువల నిర్మాణం చేపట్టాలి.
- గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు లేవు

దుబ్బాక



- దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలనే డిమాండ్
- మల్లన్నసాగర్ రిజర్వాయర్ అనుసంధానంగా కాలువల నిర్మాణం, చెరువుల అభివృద్ధి
- కొత్త మండలాలకు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు
- అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు నిధుల కొరతను తీర్చడం
- మల్లన్నసాగర్ పరిసర గ్రామాల్లో దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలి.

ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందాం

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలి
- పిల్లలు అన్నంలో కూరను కలిపి తినేలా చూడాలి
- కలెక్టర్ మనూచౌదరి

గజ్వేల్, జూలై 22 : ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందామని సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి కోరారు. గజ్వేల్ మండలం అక్కారంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు గణిత సమస్యలు పరిష్కరించడంతో వారిని అభినందించారు. విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కూరను అన్నంలో కలుపుకుని తినేలా తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏదో మొక్కుబడిగా భోజనం పెట్టకుండా రుచికరమైన భోజనాన్ని అందజేయాలని, తప్పకుండా పిల్లలు పూర్తిగా భోజనం చేసేలా చూడాలని సూచించారు. పాఠశాలలో పిల్లలకు కుళాయి సమస్య ఉందని గమనించి వెంటనే ఇంజనీరింగ్ ఏజెన్సీని పిలిచి బ్యాటరీ ఆఫ్ ట్యాప్ కనెక్షన్ నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు గుడ్లు, ఆకుకూరలు, పప్పులు, పౌష్టికాహారాన్ని అందించాలని వంట సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందామని, పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిద్దామని పిలుపునిచ్చారు. ఆయన వెంట గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఎంపీడీవో, ఎంపీవో, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.



అక్కారం పాఠశాలలో విద్యార్థులతో కలసి నేలపై కూర్చుని భోజనం చేస్తున్న కలెక్టర్

రీజనల్ రింగ్‌రోడ్డు భూభూసేకరణపై సమీక్ష

రీజనల్ రింగ్‌రోడ్డు భూసేకరణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గజ్వేల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించి, భూసేకరణ ఇతరత్రా అంశాలపై సమీక్ష చేశారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, త్రీ-ఏ, త్రీడీ, కాలా తదితరాలపై సమీక్షించారు. భూసేకరణ ప్రక్రియలో చేపట్టిన చర్యలను గూర్చి ఆర్డీవోను అడిగి తెలుసుకున్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్ : మండలంలోని నిర్మల్‌నగర్ ఆలిరాజిపేట్ ప్రాథమిక పాఠశాల, జగదేవ్‌పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించారు. కేజీబీవీలో పదోతరగతి విద్యార్థినులకు ఆయన కాసేపు టీచర్‌గా మారి గణితం బోధించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నిర్మల్‌నగర్ అల్రాజీపేట పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డిని ఆదేశించారు. కేజీబీవీలో ప్రహరీ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం త్వరగా నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, కార్యదర్శి హరిప్రసాద్, కేజీబీవీ స్పెషల్ ఉమామహేశ్వరి ఉపాధ్యాయులు ఉన్నారు.



కేజీబీవీలో విద్యార్థినులకు గణితం బోధిస్తున్న కలెక్టర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- 'ప్రజావాణి'కి 30 దరఖాస్తులు
- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 22: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె వినతులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణికి మొత్తం 30 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

పర్యాటకంపై చిగురిస్తున్న ఆశలు

7

- మహా సముద్రం గండి రిజర్వాయర్‌పై మంత్రి ప్రత్యేక దృష్టి

మెరిసిన స్టీల్‌బ్యాంకు

- సిద్దిపేటకు జాతీయస్థాయిలో గుర్తింపు
- ఆర్థిక సర్వేలో చోటు..
- మంచి కార్యక్రమమని ప్రశంస
- హరీశ్ చొరవతో ఏర్పాటు

సిద్దిపేట టౌన్, జూలై 22: సిద్దిపేట పేరు మరోసారి జాతీయ స్థాయిలో మారుమోగింది. ప్లాస్టిక్‌రహిత సిద్దిపేటగా మార్చాలనే ఉద్దేశంతో 2020లో అప్పటి మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌లను ఆర్థిక సర్వే ప్రశంసించింది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. సిద్దిపేట స్టీల్ బ్యాంక్‌ల ఏర్పాటు మంచి కార్యక్రమమని ప్రశంసించడంతో పాటు సిద్దిపేట స్టీల్ బ్యాంక్ స్ఫూర్తిని దేశమంతా అమలు చేస్తామని పేర్కొంది.

సిద్దిపేట పట్టణంలో ప్లాస్టిక్ గ్లాస్‌లు, ప్లాస్టిక్ ప్లేట్లు, ఇతరాత్రా ప్లాస్టిక్ వస్తువులను నియంత్రించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు తాను మంత్రిగా ఉన్న సమయంలో 2020న స్టీల్ బ్యాంక్‌లకు శ్రీకారం చుట్టారు. మొదట ఒక వార్డులో ప్రారంభమైన ఈ కార్యక్రమం తర్వాత అన్ని వార్డుల్లో, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది. ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగితే ఈ స్టీల్ బ్యాంక్ నుంచి తక్కువ ధరకే స్టీల్ గ్లాస్‌లు, ప్లేట్లు ఇతర వస్తువులు అద్దెకు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం అనతికాలంలోనే ప్రజల ఆదరణ పొందింది. దీంతో పట్టణంలో ప్లాస్టిక్ వినియోగమూ తగ్గింది.



హరీశ్‌రావు ట్వీట్




సిద్దిపేటలోని ఓ వార్డులో స్టీల్‌బ్యాంకును ప్రారంభిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు (ఫైల్)

గతంలోనూ ఘనత

సిద్దిపేట గతంలోనూ జాతీయ స్థాయిలో ఘనత సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌తో పాటు పలు పథకాలకు కేంద్ర అవార్డులు దక్కాయి. అలాగే, ఇక్కడ అమలు చేస్తున్న తడి, పొడి చెత్త వేరే చేయడం, కంపోస్టు తయారీ, బయోగ్యాస్ వంటి వాటి పని విధానాలను వివిధ రాష్ట్రాల అధికారులు, నాయకులు పరిశీలించి వెళ్లారు. తాజాగా స్టీల్ బ్యాంక్‌ను ఆర్థిక సర్వే గుర్తించడంతో పాటు దేశవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పడంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

ప్రజల భాగస్వామ్యం వల్లే..



ఒక పని మొదలు పెట్టినప్పుడు అవుతుందా, లేదా అనే ఆలోచనతో మొదలు పెడతాం. నా కుటుంబ సభ్యులైన సిద్దిపేట ప్రజల భాగస్వామ్యంతో ఏ కార్యక్రమం తలపెట్టిన సిద్ధిస్తుంది, ఫలిస్తుంది, ఫలితానిస్తుందనే నమ్మకం ఎంతో ఉంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ మంచి కార్యక్రమమని ప్రశంసించడం గర్వంగా ఉంది. ఇది ప్రజల భాగస్వామ్యం వల్లే సాధ్యమైంది. జాతీయ స్థాయిలో సిద్దిపేట ఖ్యాతిని నిలిపిన ప్రజలకు, అధికారులకు అభినందనలు.

– హరీశ్‌రావు, ఎమ్మెల్యే

‘ఆశా’లకు ఫిక్స్‌డ్ వేతనమివ్వాలి: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, జూలై 22: ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేసి మాట్లాడారు. 20 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్కీములు పూర్తిస్థాయిలో అమలుచేస్తున్నా నేటికీ కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అనేక రకాలుగా సేవలందించారని గుర్తుచేశారు. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షలను రద్దు చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తల సమస్యల కోసం చర్చించి వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సాయిలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి, నాయకులు గంగా, ప్రశాంతి, వీరమణి పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా చేస్తున్న ఆశాలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించండి

గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. కార్మికులు గ్రామాల్లో అనేకరకాల పనులు చేస్తూ గ్రామాన్ని అద్దంలా మారుస్తున్నా.. నేటికీ కార్మికులకు కనీస వేతనం అందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుల సత్తయ్య, దశరథ్, నాయకులు శంకర్, వెంకటయ్య, నగేష్, రాములు పాల్గొన్నారు.

రైతు బీమా కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి: ఏవో

మర్కుక్/చిన్నకోదూరు/కోహెడ/ములుగు, జూలై 22: రైతులు తప్పనిసరిగా రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని ఏవో నాగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్కుక్ మండలంలోని మర్కుక్, ఎర్రవల్లి, దామరకుంట రైతువేదికల్లో 2024 సంవత్సరానికిగాను రైతుబీమా నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్వహించారు. రైతుబీమా పథకంలో కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు వచ్చినవారు, రైతుబీమాలో ఇదివరకు నమోదు కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల పట్టాదారులు అర్హులని తెలియజేశారు. రైతుబీమా ఫారం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్కు జిరాక్స్ జతపరిచి రైతువేదికలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణువర్ధన్, అశ్విని, రైతులు పాల్గొన్నారు. 2024 జూన్ 28 లోపు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులందరూ ఆగస్టు 5 లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని చిన్నకోదూరు మండల వ్యవసాయాధికారి జయంత్‌కుమార్ సోమవారం తెలిపారు. రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని కోహెడ ఏఈవో శివకుమార్ తెలిపారు. మండలంలోని వరికోలు రైతువేదికలో సోమవారం రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ములుగు మండల వ్యవసాయాధికారి ప్రగతి కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



కోహెడ: రైతుబీమా దరఖాస్తును స్వీకరిస్తున్న ఏఈవో శివకుమార్

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

తూప్రాన్, జూలై 22: తూప్రాన్ పట్టణంలో ఫుడ్ పాయిజన్ జరిగి పలువురు అస్వస్థతకు గురికావడంతో సోమవారం పలు హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని మండి హోటల్‌లో ఈనెల 16, 17న బిర్యానీ తిన్న పలువురికి ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురయ్యారు. సుమారు 20 మంది ఫుడ్ పాయిజన్ బారినపడి ఆస్పత్రుల్లో చికిత్సలు పొందారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకిరాగా, శనివారం హోటల్‌ను మూసివేశారు. సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్యానాయక్ తూప్రాన్ పట్టణానికి విచ్చేసి మున్సిపల్ కమిషనర్ ఖాజామొహియుద్దీన్ ఆధ్వర్యంలో మండి హోటల్‌లో తనిఖీలు చేశారు. ఫుడ్ పాయిజన్‌పై పంచనామా నిర్వహించి, హోటల్‌కు తాళం వేశారు. అనంతరం శుభం మెస్, గోల్డెన్ హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మున్సిపల్ మేనేజర్ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

‘శాంతిసేన’కు ఎంపిక కావడం అభినందనీయం

● రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ అధికారి నీల చంద్రం

మర్కుక్, జూలై 22: ప్రపంచంలో ఉన్న పేద దేశాల శాంతిస్థాపన కోసం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేసే శాంతిసేన కోసం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన జవాన్ బొక్కి వెంకటేష్ ఎంపికకావడం అభినందనీయమని రిటైర్డ్ ఇండియన్ ఆర్మీ అధికారి నీల చంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. బొక్కి ముత్యాలు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడైన వెంకటేష్ ఇంటర్మీడియట్ పూర్తిచేసిన వెంటనే ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్‌లో చేరి 18 ఏళ్ల లోనే ఆర్మీకి ఎంపికయ్యారు. ఈ మధ్యనే ఆర్మీలో అన్నింటికన్నా కష్టమైన రాష్ట్రీయ రైఫిల్లో అంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్‌లో పాల్గొని వచ్చిన వెంకటేష్.. ఆరునెలలు తిరగకుండానే ఐక్యరాజ్య సమితి పరిధిలో పనిచేసే శాంతిసేనకు ఎంపికకావడం సిద్దిపేట జిల్లాకే గర్వకారణమని చంద్రం పేర్కొన్నారు. అనంతరం వెంకటేష్‌ను ఆజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షఫీతో కలిసి సన్మానించారు.



వెంకటేష్‌ను వాళ్ల అమ్మానాన్నలతో సన్మానిస్తున్న చంద్రం

ఖాతాదారులకు మెరుగైన సేవలు

● సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సోమలింగంగౌడ్

సంగారెడ్డి టౌన్, జూలై 22: ఖాతాదారులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకు డైరెక్టర్ సోమలింగంగౌడ్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని సిటిజన్ కో ఆపరేటీవ్ సొసైటీ బ్యాంకులో సోమవారం ఖాతాదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగంగౌడ్ మాట్లాడుతూ ఈ సొసైటీని స్థాపించి 27 ఏళ్లు అయిందని, బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారుల సహకారం మరిచిపోలేనిదన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ 42 బ్రాంచీలతో 5 రాష్ట్రాలలో రూ.4 వేల కోట్ల టర్నోవర్‌తో ఇతర బ్యాంకులకు దీటుగా కొనసాగుతుందని వివరించారు. సభ్యులకు మెరుగైన, నమ్మకమైన సేవలందించడంతో పాటు వచ్చే 2025 నాటికల్లా రూ.5 వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సోమలింగంగౌడ్

గణేష్‌నగర్‌లో రోడ్డు ఆక్రమించి ప్రహరీ

● మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్, జూలై 22: సంగారెడ్డి మునిసిపాలిటీ పరిధిలోని గణేష్ నగర్‌లో ఓ ప్రైవేటు స్థల యజమాని రహదారిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని కాలనీవాసులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. గణేష్‌నగర్‌లోకి వెళ్లేందుకు 20 ఫీట్ల రోడ్డు ఉండగా, ఆ రోడ్డును సదరు ప్రైవేట్ స్థల యజమాని నిబంధనలకు విరుద్ధంగా సరిహద్దు గోడను నిర్మించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సరిహద్దు గోడ నిర్మాణంతో ఎదురెదురుగా వాహనాలు ప్రయాణించేందుకు అవకాశం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మించిన ప్రహరీని తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.



గుట్టపై నుంచి కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగాలు



మహా సముద్రం రిజర్వాయర్



బయ్యన్న గుట్టలపై వెలసిన హనుమాన్ విగ్రహం, గుట్టపై ప్రతిష్ఠించిన అయ్యప్పస్వామి విగ్రహం



ఉమ్మాపూర్ గుట్టలపై ఆనాటి బంగారు బావి

పర్యాటకంపై చిగురిస్తున్న ఆశలు

- మహా సముద్రం గండి రిజర్వాయర్‌పై మంత్రి ప్రత్యేక దృష్టి
- ఇటీవల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శన
- ప్రాచీన నాగరికతకు పుట్టినిల్లు ఇక్కడి బయ్యన్న గుట్టలు
- గుట్టపైన ఆంజనేయస్వామి, అయ్యప్ప ఆలయాలు
- ఈ ప్రదేశాన్ని చూసి సంతోషపడిన మాజీ సీఎం కేసీఆర్

హుస్నాబాద్, జూలై 22: చుట్టూ ఎత్తైన కొండలు.. పచ్చిక బయళ్లు.. సహజ సిద్ధమైన వన సంపద.. మధ్యమధ్యలో సెలయేర్లు.. గుట్టల మధ్యలో సరస్సు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. స్వేచ్ఛగా విహరించే జంతు జాలం.. ఈ ప్రదేశాన్ని చూస్తే ఏదో కొత్త అనుభూతి కలుగుతుంది. ఈ ప్రకృతి సౌందర్యం ఒక్కటే కాదు.. ఆది మానవుని అవశేషాలు..సర్వాయి పాపన్న నిర్మించిన కట్టడాలు.. ప్రాచీన నాగరికతకు అద్దంపట్టే సాజీవ సాక్ష్యాలు ఇక్కడ దర్శనమిస్తాయి.. ఇది సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్మాపూర్ మహాసముద్రం గండి రిజర్వాయర్ బయ్యన్న గుట్టల్లో దాగి ఉన్న ప్రాచీన సంపద. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా కోరుతున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ ప్రదేశాన్ని చూసి ఆకర్షితులయ్యారు. ఇది పర్యాటక కేందంగ్రా విరాజిల్లుతుందని కితాబుఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేదు. ఇటీవల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. అందులో భాగంగా ఇటీవల ఈ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మూడురోజుల క్రితం మహాసముద్రం రిజర్వాయర్ ప్రాంతాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. దీంతో ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా మారుతుందని ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రాచీన నాగరికతకు సాక్ష్యాలు

ఉమ్మాపూర్ గ్రామ శివారులో ఉన్న మహాసముద్రం గండికి పక్కనే బయ్యన్న గుట్టల్లో సర్వాయి పాపన్న రాతి గోడ నిర్మించారు. ఈ ప్రాంతంలో చుట్టూ గుట్టలు.. ఈ గుట్టల మధ్య మహాసముద్రం గండి రిజర్వాయర్ చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న ఎత్తైన బయ్యన్నగుట్టల్లో ఆది మానవుని శిలా విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తాయి. ప్రకృతి రమణీయత మధ్య గుట్టపైన వెలసిన కోనేరులు, సెలయేరులు వింత అనుభూతిని కలిగిస్తాయి. ఈ గుట్టలపైన పరిసర ప్రాంతంలో వ్యవసాయానికి అనుగుణంగా సారవంతమైన భూమి కూడా ఉంది. ఇక్కడే ఒక పెద్ద సెలయేరు, మూడు కోనేరులు, బంగారు బావిగా పిలవబడే బావి, రాతి కట్టడాలు, ప్రహరీ నిర్మాణాలు దర్శనమిస్తాయి. శిథిలమైన నాటి సాంకేతిక నైపుణ్యతకు ఇవి గుర్తులుగా కనిపిస్తాయి. శిలాతోరణాలు, చిన్న నీటి గుంతలు, ప్రాచీన మానవుడు పూజించిన శిథిలమైన ఆలయాలు, శిలలపై ఆదిమానవుని లిపి, క్రమపద్ధతిలో నిర్మించిన రాతి కట్టడాలు, శిలలను పగుల దీసి సాగునీటికై నిర్మించుకున్న కాలువలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గుట్ట పైభాగాన హనుమాన్ ఆలయం ఉన్నది.

ఆదిమానవుని అవశేషాలు..

ఈ గుట్టల్లో ఆదిమానవుడు నివసించిన రాతి గుహలు, వారికి సంబంధించిన ఆవశేషాలు ఇక్కడ దర్శనమిస్తాయి. నీరు నిలువ చేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న రాతి గుంతలు, వంట చేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న రాతి పొయ్యిలు, రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ప్రాచీనకాలంలోనే నాగరికత ప్రస్ఫుటంగా విలసిల్లిందనడానికి అనేక సాక్ష్యాలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతారు. గుట్టపై కొలనులో వెలసిన బంగారుబావి, నాటి సమాజానికి శిథిల గుర్తులుగా నేటికీ కనిపిస్తున్నది.

బయ్యన్న దేవుడు

నాటి కాలంలో సరైన సమయంలో వర్షాలు కురియక పోతే ఈ గుట్టలపై వెలసిన బయ్యన్న దేవుడిని ఆరాధిస్తూ కొలిచేవారని తెలుస్తోంది. ఇప్పటికీ అదే విశ్వాసంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు సకాలంలో వర్షాలు కురియని పక్షంలో బయ్యన్న దేవుడిని ఆరాధిస్తారు. ఉమ్మాపూర్ చుట్టు పక్క గ్రామాలైన నాగారం, మహ్మదాపూర్, మడద, పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట, శివరాంపల్లి, గూడెం, ఆకునూరు, గణపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు వర్షాలు కురిపించాలని వేడుకోవడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. ఇక్కడి నీరు చాలా పవిత్రమైందని ప్రజలు విశ్వసిస్తారు. మహ్మదాపూర్‌కు చెందిన భక్తులు గుట్టపై భాగాన పదేళ్ల క్రితం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం గుట్టల పైభాగానికి వెళ్లేందుకు మహ్మదాపూర్ నుంచి మిషన్ భగీరథ కోసం ఘాట్ రోడ్డు నిర్మించారు. ప్రతిఏటా శ్రావణ మాసంతో పాటు ఏడాది పొడుగునా ఈ గుట్టల ప్రాంతానికి సందర్శకులు వస్తుంటారు.

వనమూలికలకు నిలయం

బయ్యన్న గుట్టల ప్రాంతంలో రోగనిరోధక వనమూలికలు, వివిధరకాల పండ్ల చెట్లు దర్శనమిస్తాయి. అనేకమంది ఈ ప్రాంతం నుంచి మూలికలు తీసుకెళ్తుంటారు. ఈ గుట్టల పైభాగానికి వెళ్లేటప్పుడు మెలికలు తిరిగిన దారులు, ముళ్లపొదలు, అడవి జంతువుల మధ్య ఉన్న ఈ ప్రాంతం చేరుకోవడానికి దాదాపు నాలుగు గంటల సమయం పడుతుంది. ఖరీదైన గ్రానైట్‌రాయి, పశువుల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న రాతి కట్టడాలు శిథిలమై ఉన్నాయి. ఆనాటి ఆట వస్తువులుగా చెప్పుకునే పచ్చీస గుండ్లు కనువిందు చేస్తాయి. ఇంతటి చరిత్ర ఉన్న ఈ ప్రాంతం చరిత్ర పుటలకెక్కలేదు. ఈ ప్రాంతంపై పురావస్తు శాఖ సైతం పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తుంది.

నాడు కేసీఆర్ సందర్శన

8 ఆగస్టు 2015న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మహాసముద్రం గండి రిజర్వాయర్‌ను సందర్శించారు. దాదాపు రెండు గంటల పాటు ఈ ప్రదేశంలో గడిపారు. ఇది పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని కితాబిచ్చారు. 52 ఏళ్ల క్రితం మహాసముంద్రం చెరువుకు పడిన గండిని పూడ్చడానికి రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించాడు. సీఎం హామీ మేరకు ఈ పనులకు రూ.3.87 కోట్లు మంజూరు చేశారు. 332 ఎకరాల ఆయకట్టు కలిగిన మహాసముద్రం గండి పనులు పూర్తికావడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌గా ఉపయోగపడుతుంది. చుట్టూ 20 గ్రామాలకు భూగర్భ జలాలు పెంపొందుతున్నాయి. రైతులకు ఈ రిజర్వాయర్‌తో సాగునీటి సమస్య తీరింది.

ప్రభుత్వంపైనే ఆశలు

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉన్నారు. ఇటీవల ఈ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు కావాల్సిన అవసరాలు, నిధులపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మూడురోజుల క్రితం అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మహాసముద్రం రిజర్వాయర్ ప్రదేశాలను టూరిజం శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఇక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుట్టల పై భాగానికి వెళ్లేందుకు కావాల్సిన రహదారి, మహాసముద్రంలో బోటింగ్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. దీంతో సహజ సిద్ధమైన ప్రకృతి సౌందర్యం కలిగి ఉండటమే కాకుండా సర్వాయి పాపన్న సంచరించిన ఈ ప్రదేశం పర్యాటక కేంద్రంగా మారుతుందని ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



సర్వాయి పాపన్న ఏర్పాటు చేసుకున్న కోట గోడ



మహాసముద్రం ప్రాంతాన్ని సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



గుట్టల నుంచి వస్తున్న జలపాతం

స్మితా సభర్వాల్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి


- దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ప్రతినిధులు



జోగిపేట: ప్రజావాణిలో తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగులు

సిద్దిపేట అగ్రికల్చర్/నారాయణరావుపేట/మిరుదొడ్డి/జోగిపేట, జూలై 22: దివ్యాంగుల పట్ల వివక్షపూరిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ స్మితా సభర్వాల్ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92 ప్రకారం నేరమని, సిద్దిపేట దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా దివ్యాంగ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యాన్వేష్, జనరల్ సెక్రెటరీ పరమేశ్వర్ పాల్గొన్నారు. దివ్యాంగులపై సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు దండు శంకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులను అవమానపరిచిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. దివ్యాంగులపై ఐఏఎస్ స్మితా సభర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై దివ్యాంగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నె పోచయ్య, అందోలు డివిజన్ అధ్యక్షుడు సుభాష్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

అల్లం రైతుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్లం రైతులు

జహీరాబాద్, జూలై 22: జహీరాబాద్ ప్రాంతంలో అల్లం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అల్లం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రైతులు ప్రధాన పంటగా అల్లం తదితరాలను పండిస్తామన్నారు. అయితే హైదరాబాద్ మార్కెట్లోకి కేరళ నుంచి లేత అల్లం తేవడంతో తాము పండించిన అల్లానికి ధర లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ మార్కెట్‌కు జూన్, జూలైలో కేరళ నుంచి లేత అల్లం తీసుకురాకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించామన్నారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారని పేర్కొన్నారు. అయినా కొందరు హైదరాబాద్ మార్కెట్‌కు కేరళ లేత అల్లంను తీసుకురావడంతో తాము పండించిన పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తరలించిన అల్లం పంటను హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తే ప్రస్తుతం క్వింటాలుకు రూ.10 వేలు పలుకుతుందని, ఖర్చులన్నీ పోను రూ.7 వేలు మాత్రమే చేతికి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లం రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి: కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూలై 22: అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన పనులు, పురోగతి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులతోపాటు సంబంధిత శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యటించి లోటుపాట్లను సవరించాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో సమస్యను పరిష్కరించాలని తెలిపారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రజలకు సోకకుండా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, జూలై 22: మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్రకుమార్ తెలిపారు. ఈనెల 25న ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని, అర్హులైన హాజరుకావాలన్నారు. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు-25, అసోసియేట్ ప్రొఫెసర్లు-28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-56 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎండి/ఎంఎస్/డిఎన్బి, పీజీ డిగ్రీలో సాధించిన మార్కులు, ట్యూటర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులు, అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు పరిగణలోకి తీసుకుంటామని ఆర్ఓఆర్‌ను అనుసరిస్తారని తెలిపారు. ట్యూటర్ సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుదారుడి వయసు 31-03-2025 నాటికి 45 ఏళ్లలోపు ఉండాలన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1,90,000 ఉంటుందని, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనం నెలకురూ.1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1,25,000 ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో 25న హాజరుకావాలని సూచించారు.

అరుదైన నక్షత్ర తాబేలు

- అటవీ అధికారులకు అప్పగింత



తాబేలును అటవీ అధికారులకు అప్పగిస్తున్న శ్రీధర్ మహేంద్ర, నక్షత్ర తాబేలు

సంగారెడ్డి రూరల్, జూలై 22: అరుదైన జాతికి చెందిన నక్షత్ర తాబేలు సంగారెడ్డికి చెందిన రాజుకు సోమవారం లభించింది. దానిని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి వీరేంద్రబాబు సమక్షంలో అటవీ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్‌బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్, సహాయ కార్యదర్శి పాండురంగం, కార్యవర్గ సభ్యుడు సాయి పాల్గొన్నారు.

భూమి ఇవ్వాలని బెదిరింపులు

- న్యాయం కోసం పురుగుల మందు డబ్బాతో రైతుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత రైతుల ధర్నా

రామాయంపేట, జూలై 22: 25 ఏళ్లుగా సాగుచేస్తున్న తమ పట్టా భూమిపై కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, అక్రమంగా భూమిని లాక్కునే ప్రయత్నంలో బెదిరిస్తున్నారని బాధిత రైతులు సోమవారం పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తమకు న్యాయం జరగక పోతే ఆత్మహత్యే శరణ్యమంటూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. పట్టణంలోని నాలుగు కుటుంబాలకు చెందిన సుమారు 15 మంది గంట పాటు కార్యాలయం ఎదుట బైఠాయించి, అనంతరం తహసీల్దార్ రజినికి వినతిపత్రం అందజేశారు. అన్నివిధాలా పట్టా ఉన్నప్పటికీ.. ఇద్దరు తమదేనంటూ ఇబ్బందులు పెట్టడమే కాకుండా.. పోలీసు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్యాయంగా ఇబ్బందుల పాలుచేస్తే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో ముగిసిన పాఠశాలల ఆడిట్



గాంధీసెంటినరీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆడిట్‌కు హాజరైన హెచ్‌ఎంలు

సంగారెడ్డి అర్బన్, జూలై 22: జిల్లాలో రెండురోజుల పాటు నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ఆడిట్ ముగిసింది. ఇందులో భాగంగా సోమవారం సంగారెడ్డిలోని గాంధీసెంటినరీ హైస్కూల్‌లో సంగారెడ్డి, కంది, హత్నూర, కొండాపూర్, సదాశివపేట మండలాలు, జడ్పీ హైస్కూల్‌లో అందోల్, వట్‌పల్లి, పుల్‌కల్, చౌటకూర్, మునిపల్లి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆడిట్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన చార్టెడ్ అకౌంట్స్ అధికారులు ఆడిట్ సజావుగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాలల నిర్వహణ నిధుల వినియోగం, ఖర్చు, క్యాష్ బుక్, బిల్స్, వోచర్స్, స్టాక్, అంతేకాకుండా సీఆర్‌సీ, ఎంఆర్‌సీ గ్రాంటు నిర్వహణ నిధులు వినియోగం తదితర వివరాలు, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది ఆడిట్‌లో పాల్గొన్నారు.

బదిలీపై రావడానికి అధికారుల అనాసక్తి

- సిరిసిల్లా జోన్‌లో నర్సాపూర్ ఉండటమే కారణం



నర్సాపూర్ పీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం

నర్సాపూర్, జూలై 22: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలోని వివిధశాఖల్లో బదిలీపై రావడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్నిశాఖల్లో సిబ్బంది నుంచి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో కూడా బదిలీల ప్రక్రియ జరగ్గా.. నర్సాపూర్‌లో పనిచేసిన ఏఈలంతా బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇక్కడికి ఎవరూ రాలేదు. ప్రస్తుతం పీఆర్ నర్సాపూర్, కౌడిపల్లి సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఏఈలు లేని పరిస్థితి నెలకొన్నది. నర్సాపూర్ సబ్ డివిజన్ పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో మొత్తం ఏడుగురు ఏఈలు ఉండాల్సి ఉండగా.. నలుగురు బదిలీపై వెళ్లగా.. ఉన్న ఇద్దరిలో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉండగా.. ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. నర్సాపూర్ పీఆర్ సబ్ డివిజన్ ఇంజనీరింగ్ విభాగంలో ఒక్క డీఈఈ, ఒక్క ఏఈ మాత్రమే ఉన్నారు. అదేవిధంగా కౌడిపల్లి పీఆర్ సబ్ డివిజన్ పరిధిలో పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ సబ్ డివిజన్ పరిధిలో ఐదుగురు ఏఈలకుగాను.. నలుగురు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఒక్క డీఈఈ, ఒక్క ఏఈ మాత్రమే ఉన్నారు. బదిలీపై వెళ్లినవారి స్థానంలో ఇక్కడికి ఎవరూ రావడం లేదు. దీనికి ప్రధాన కారణం నర్సాపూర్ నియోజకవర్గం ప్రస్తుతం సిరిసిల్లా జోన్‌లో ఉంది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం సిరిసిల్లా జోన్‌లో ఉండటం వల్ల ఇక్కడికి వచ్చే అధికారులకు, ఇతర ఉద్యోగులకు హైదరాబాద్‌తో ఎలాంటి సంబంధం లేకుండాపోతోంది. ఇక్కడికి బదిలీపై వస్తే ఇక సిరిసిల్లా జోన్ ప్రకారం మెదక్, సిద్దిపేట, కామారెడ్డి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందనే ఉద్దేశంతో అధికారులు బదిలీపై వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ ఒక్క కార్యాలయమే కాదు ఇతర శాఖల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ఈ ప్రాంత ఉద్యోగులు నర్సాపూర్ నియోజకవర్గాన్ని సిరిసిల్లా జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూనే ఉన్నారు. గత ఎన్నికల సమయంలో కూడా ఆయా పార్టీలకు విన్నపాలు చేశారు. కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న చార్మినార్ జోన్‌కు బదులు ఎక్కడో వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరిసిల్లా జోన్‌లో కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు.

మొక్కల పంపిణీ

గజ్వేల్, జూలై 22: 75వ వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పంపిణీ చేశారు. ఆయా వార్డులలో కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, వంటేరు గోపాల్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్‌లు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వారితో ఆయా వార్డు అధ్యక్షులు ఉన్నారు.

తొగుట ఎస్‌ఐగా రవికాంతరావు

తొగుట, జూలై 22: తొగుట ఎస్‌ఐగా రవికాంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ లింగంను అధికారులు హైదరాబాద్ డీజీజీ ఆఫీస్‌కు అటాచ్ చేయడంతో ఇక్కడి ఖాళీ ఏర్పడింది. దాంతో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో వీఆర్‌లో ఉన్న రవికాంత్‌ను అధికారులు ఇక్కడికి బదిలీ చేశారు.





నిండుకుండలా మారి మత్తడి దూకుతున్న సిద్దిపేట పట్టణంలోని చింతల చెరువు



అలుగు పారుతున్న చిన్నకోడూరు బ్రాహ్మణుల చెరువు

మత్తళ్లు దూకుతున్న చెరువులు

మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు చెరువులలోకి నీరు చేరి నిండుకుండలాగా మారాయి. పలుచోట్ల చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. సోమవారం వర్షం తగ్గడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

-సిద్దిపేట జిల్లా స్టాప్ ఫొటో గ్రాఫర్



రంగనాయకసాగర్ ప్రాజెక్టు సమీపంలో నాట్లు వేస్తున్న మహిళలు

కారు, ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

సిద్దిపేట రూరల్, జూలై22: కారు, ఆటో ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్‌కు చెందిన బాలమల్లు, మానస, గాజులపల్లికి చెందిన లావణ్యలు ఎపీ15వై8391 నెంబర్ గల ప్యాసింజర్ ఆటోలో సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇర్కోడు శివారులో టీఎస్36ఎం2531 నెంబర్ గల కారు ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై లావణ్య భర్త మాదారి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ తపోలీసులు తెలిపారు.

సైబర్ బాధితులకు మెరుగైన సేవలందించాలి

● సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపేట క్రైం, జూలై 22: సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందించాలని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి సైబర్ వారియర్స్‌కు సూచించారు. జిల్లాలో ఉన్న సైబర్ వారియర్స్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ట్రెండింగ్ సైబర్ నేరాల గురించి ఆయన ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సైబర్ వారియర్స్, సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీంలు

● హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట, జూలై 22: మహిళల రక్షణకు షీటీంలు ఏర్పాటు చేశామని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. అక్కన్నపేటలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఎస్‌వో సరిత తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో

తొగుట, జూలై 22: తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని శారదాంబ పార్‌బాయిల్డ్ రైస్‌మిల్‌ను సోమవారం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తీరుతెన్నులు, ప్రభుత్వానికి సరఫరా చేసే బియ్యం పంపిణీ సక్రమంగా ఉందా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనవెంట తొగుట తహసీల్దార్ శ్రీకాంత్, వర్గల్ తహసీల్దార్ బాలరాజ్, సివిల్ సప్లై డీటీ స్వామి, తొగుట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రాజ్, తొగుట ఎస్‌ఐ రవికాంతరావు తదితరులు పాల్గొన్నారు.



తొగుట్ట: ఎల్లారెడ్డిపేట రైస్‌మిల్‌లో తనిఖీ చేస్తున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

హోటళ్లు, మాంసం దుకాణాల్లో..

మద్దూరు, జూలై 22: మండల కేంద్రంలోని హోటళ్లు, మాంసం దుకాణాల్లో సోమవారం ఎంపీడీవో ఎస్. రామ్మోహన్‌తో పాటు ఎంపీవో ఖాజామొయినుద్దీన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లు, మాంసం దుకాణాల్లో పరిశుభ్రతతో పాటు నాణ్యమైన వాటిని విక్రయిస్తున్నదీ లేనిది పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 22: గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవితో కలిసి డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీవోలతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. డయేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా తాగు నీరు క్లోరినేషన్ చేయించాలని, డెంగీ వ్యాధిని నిరోధించేందుకు దోమలు పెరగకుండా ప్రతీ గ్రామంలో వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయించాలని, నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని అన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి రెండు రోజులు ఆయా మండలాలలోని గ్రామాలను తప్పకుండా సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారులు మల్లికార్జున్, లత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధి కల్పనకు..

ట్రాన్‌జెండర్ల ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని కలెక్టర్ మను చౌదరి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ స్విచ్ ఎకో సంస్థ ప్రతినిధి అక్షయ్ నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తమకాళ్లపై తాము నిలబడేందుకు ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఇష్టమైన రంగాల్లో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. డీఆర్డీఏ ద్వారా కూడా పాడి ఆవుల పెంపకం, పౌల్ట్రీఫామ్, క్యాంటీన్ నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, బ్యూటీ పార్లర్, మిల్క్‌పార్లర్ లాంటి యూనిట్ల ద్వారా అవకాశాలను కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

● ఏడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు



కొండపాక: సిద్దిపేట పట్టణంలోని బీడీ కార్మికుల కాలనీ పాఠశాలలో టీఎల్‌ఎం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొండపాక /మర్కుక్, జూలై 22: జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ్' కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు ఏడు రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తొలిరోజు సోమవారం ఉపాధ్యాయులు స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్‌ఎం రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమాలను ఎంఈవో, ఎంఎన్‌వో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించనున్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ చేసి భద్రపరచాలని డీఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

'శిక్ష సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా మర్కుక్‌లో మొదటి రోజు షెడ్యూల్‌లో టీఎల్‌ఎం ప్రదర్శన పాఠశాల స్థాయిలో నిర్వహించి విద్యార్థులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాములు, జీహెచ్‌ఎం సైన్స్ ఉపాధ్యాయులు వైవీఎన్‌రెడ్డి, చిన్నబ్రాహ్మయ్య, కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టు నేత కె. రంగాచారికి విశిష్ట పురస్కారం

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 22: సిద్దిపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టు సంఘం జిల్లా నేత కలకుంట్ల రంగాచారికి విశిష్ట వ్యక్తి పురస్కారం లభించింది. హైద్రాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన శ్రీవైష్ణవసేవా సమితి రజతోత్సవాల్లో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నాయకులు సముద్రాల వేణుగోపాలాచార్యులు, మోహన్, చిలకమర్రి లక్ష్మీనాథాచార్యుల చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

దాశరథి జయంతి

హుస్నాబాద్ టౌన్, జూలై 22: హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను సామాజిక ఉద్యమకారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, రచయిత వడ్డెపల్లి మల్లేశం, అయిలేష్ యాదవ్, రాజు, లక్ష్మన్, వీరన్న, కొమురయ్య, బాలు, శ్రీనివాస్, అంజనేయులు, సమ్మయ్య, మాటేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'సాగులో నూతన పద్ధతులతో లాభదాయకం'



రైతుతో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ జయదేవ్

వర్గల్, జూలై 22: సాగులో నూతన పద్ధతులు అవలంబిస్తేనే లాభదాయకమని డీఆర్డీవో పీడీ జయదేవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శేరిపల్లిలో హార్టికల్చర్ అధికారులతో కలిసి రైతు బోయిని నాగేశ్ డ్రిప్ పద్ధతిలో సాగు చేసిన సీతాఫల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినూత్న పద్ధతిలో కొత్తరకం పండ్ల మొక్కలను సాగుచేయడం అభినందనీయమని అభినందించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారులు తదితరులు ఉన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు

చేర్యాల, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని చేర్యాల కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి, నాయకులు ఉడుముల బాల్‌రెడ్డి, కూకట్ల బాలరాజు, ఉడుముల భాస్కర్‌రెడ్డితో పాటు జనగామ నేతలు కలిసి నియోజకవర్గ రాజకీయాలు, పార్టీ అంతర్గత స్థితిగతులపై చర్చించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పాటు నియోజకవర్గాన్ని పునరుద్ధరింపచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న పార్టీ పరిస్థితులపై సమన్వయ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు మొగుళ్ల రాజిరెడ్డి తెలిపారు.

విద్యార్థులు మంచి చేతిరాతతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు

● మాజీ జడ్పీటీసీ శ్రీహరిగౌడ్

సిద్దిపేట రూరల్, జూలై22: విద్యార్థులు మంచి చేతిరాతతో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని మాజీ జడ్పీటీసీ కోటగిరి శ్రీహరిగౌడ్ పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం రాత నేర్చుకో తలరాతమార్చుకో కార్యక్రమంలో భాగంగా మాజీ జెడ్పీటీసీ సహకారంతో విద్యార్థులకు చేతిరాత అభ్యసన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈసరి రవీందర్, రాధాపద్మజ, ఉపాధ్యాయులు అరుణ, రేణుక, శ్రీనివాస్‌రావు, సబితా, చంద్రశేఖర్, కిష్టారెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చేతిరాత పుస్తకాలు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీహరిగౌడ్

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం

● సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



బదిలీ అయిన ఉద్యోగులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేట టౌన్, జూలై22: ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు పేర్కొన్నారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న తొమ్మిదిమంది ఉద్యోగులు బదిలీపై వెళుతున్న సందర్భంగా సోమవారం వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పట్టణ కౌన్సిలర్లు సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు మాట్లాడుతూ.. బదిలీపై వెళుతున్న వారందరూ సిద్దిపేట మున్సిపాలిటీ అభివృద్ధిలో ఏవిధంగా సహాయ సహకారాలు అందించారో వెళ్తున్న మున్సిపాలిటీలలో కూడా అదేవిధంగా విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు మాట్లాడుతూ.. సిద్దిపేట మున్సిపాలిటీ తమకు అమ్మలాంటిదని, తమకు ఎన్నో అనుభవాలను ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు కలకుంట్ల మల్లికార్జున్, సద్ది నాగరాజురెడ్డి, కోఅప్షన్ సభ్యులు మహమ్మద్ సయ్యద్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలోనే కొనసాగించాలి..

● సీపీఎం ఆందోళన

చేర్యాల, జూలై 22: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట మండలాలను సిద్దిపేట జిల్లాలోనే కొనసాగిస్తూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం చేర్యాలలో సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంగడిబజారులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా నాలుగు మండలాల ప్రజలు సిద్దిపేట జిల్లాలో కొనసాగుతున్నారని, ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన సలహాతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జనగామ జిల్లాలో కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొనడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈవిషయమై వెంటనే తనవ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, రాళ్లబండి నాగరాజు, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.



చేర్యాలలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

● ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సంబురాలు

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ అనుకూలంగా ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు

సిద్దిపేట టౌన్, జూలై22: దేశ చరిత్రలోనే రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడం చరిత్రాత్మకమని, ఆ ఘనత కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు రూ. 7వేల కోట్లతో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకుని సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తుఇమామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో రైతులకు రుణమాఫీతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ హయాంలోనే మల్లన్న ఆలయాభివృద్ధి'

చేర్యాల, జూలై 22: కొమురవెల్లి మల్లన్న ఆలయంతో పాటు చేర్యాల ప్రాంతం బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధికి నోచుకుందని బీఆర్‌ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆలయం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకపోగా, ఆలయ నిధులను తరలించుకుపోయారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లన్నపేరిట 136ఎకరాల భూమి పట్టా చేశారని, కోట్లాదిరూపాయలతో ఆలయాభివృద్ధి పనులు కొనసాగించడంతో భక్తుల ఇక్కట్లు తీరాయన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆలయంతో పాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై చేసిన విమర్శలు అర్థరహితమన్నారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచు కొండా శ్రీధర్, నాయకులు సార్ల కిష్టయ్య, ముత్యం పరువురాములు, మందాల బాబు, చిగురుపల్లి రాజు ఉన్నారు.

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో శ్రావణీ నక్షత్ర పూజలు

వర్గల్, జూలై 22: వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణీ నక్షత్ర పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం వెంకటేశ్వర స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు కమిటీ అన్నప్రసాదాలను అందజేసింది.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

● ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంపా శ్రీనివాస్



చేర్యాలలో ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సభ్యులు

చేర్యాల, జూలై 22: ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంపా శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఆర్యవైశ్య మహాసభ చేర్యాల పట్టణ, మహిళ, యువజనసంఘాల నూతన కార్యవర్గాన్ని ఇటీవల నియమించిన క్రమంలో సోమవారం స్థానిక ఓ గార్డెన్స్‌లో ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ ప్రతినిధులు ఆయా విభాగాల సభ్యులచే ప్రమాణం చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరికి సహాయం అందించాల్సినా ముందుండి చేదోడుగా నిలిచేది ఆర్యవైశ్యులేనన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి తడక లింగమూర్తి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు హేమలత, యువజనవిభాగం జిల్లా అధ్యక్షుడు రావికంటి చంద్రశేఖర్, వాసవీసేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గుజ్జ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పడిన కాలనీల్లో రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయి జలాశయాలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా 16, 17 వార్డుల మధ్యలో గల కాలనీల్లో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొన్నది. 3వ వార్డులోని ప్రధాన రోడ్డు అయిన జగదేవ్‌పూర్ చౌరస్తా నుంచి ఇందిరా గాంధీ రోడ్డు వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ఇక పలు కాలనీల్లో ప్రధాన రోడ్లు ఇరవై ఏళ్ల క్రితం వేయగా అవి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకవర్గసభ్యులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు సోషల్‌మీడియా వేదికగా వాపోతున్నారు.

- గజ్వేల్

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

● బీజేపీ నాయకుల డిమాండ్

గజ్వేల్, జూలై 22: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేర బీసీ డిక్లరేషన్ వెంటనే అమలుచేయాలని బీజేపీ గజ్వేల్ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు దువ్వల రాజుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కులగణన చేసి బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లను 23శాతం నుంచి 42శాతానికి పెంచాలన్నారు. వారితో బీజేపీ జిల్లా కార్యదర్శి శశిధర్, పట్టణ ఉపాధ్యక్షుడు కిష్టాగౌడ్, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి తలారి రాజు, కాశమైన రమేశ్, ఎల్ల మధు ముదిరాజ్, కార్యదర్శులు నరేశ్, రేవంతుల సురేశ్, శివలింగు కరుణాకర్ ఉన్నారు.

● కోహెడ: కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఓబీసీమోర్చా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎర్ర దేవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీమోర్చా మండలాధ్యక్షుడు కక్కెర్ల దామోదర్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్యగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఖమ్మం సతీష్, బొమ్మగాని శివకుమార్, బీజేపీ సీనియర్ నాయకులు బినావేని లక్ష్మణ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

● దుబ్బాక: ప్రభుత్వం బీసీ డిక్లరేషన్లను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీన్ డిమాండ్ చేశారు. సోమవారం దుబ్బాక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు అశోక్, భాస్కర్, సుదర్శన్, రాజు, సప్తగిరి, శ్రీకాంత్, నేహల్, రంజిత్ ఉన్నారు.



కోహెడ: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

● హుస్నాబాద్ టౌన్: కాంగ్రెస్ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయం ఎదుట బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు, భూషంకరాచారి, నాయకులు రాంప్రసాద్, అకోజు అరుణ్, వరియోగుల అనంతస్వామి, సంతోష్, వెంకటేష్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.